ప్రజాశక్తి
గురువారం 11 మే 2023 5 శ్రీ సత్యసాయి





సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రత్యేక అధికారి చక్రధర్‌బాబు

# అధికారులు సమిష్టిగా పనిచేయాలి

◆ జగనన్నకు చెబుదాంపై ప్రజలకు అవగాహన కల్పించాలి
◆ జిల్లా ప్రత్యేక అధికారి చక్రధర్‌బాబు

**ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్**

ప్రభుత్వంపై ప్రజల్లో మరింత నమ్మకం పెరగడానికి అధికారులందరూ సమిష్టిగా పనిచేయాలని, జిల్లా స్పెషల్ ఆఫీసర్ కెవిఎన్ చక్రధర్ బాబు (ఏపీజెన్‌కో మేనేజింగ్ డైరెక్టర్) అధికారులను ఆదేశించారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహణపై బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో స్పందనపై కలెక్టర్ అరుణ్ బాబు, ఎస్పీ మాధవరెడ్డితో వివిధ శాఖల జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సేవలకు సంబంధించి వ్యక్తిగత ఫిర్యాదులకు మరింత మెరుగైన సంతప్తికర పరిష్కారం లభించే విధంగా, జగనన్నకు చెబుదాం అనే కార్యక్రమం ప్రవేశపెట్టిందన్నారు. ఈ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి కార్యాలయం పర్యవేక్షిస్తోంటోందని చెప్పారు. ఈ కార్యక్రమం అమలును పరిశీలించేందుకు ఒక్కో జిల్లాకు ఒక్కో ప్రత్యేక అధికారిని నియమించిందన్నారు. కార్యక్రమం అమలుకు ఏమైనా సమస్యలు ఉంటే అందరి సమన్వయంతో సమిష్టిగా పరిష్కరిద్దామన్నారు. క్షేత్రస్థాయిలో ప్రతి ఫిర్యాదుకూ నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు. అర్జీదారులకి న్యాయం చేయాలనే లక్ష్యంతో పనిచేయాలన్నారు. సచివాలయాల్లో 250 సేవలుపైగా అందిస్తున్నారని అర్జీ పెట్టుకుంటే వెంటనే పరిష్కరిస్తారన్న సంతప్తి ప్రజల్లో కలగాలన్నారు. గడువులోగా పరిష్కరించడమే జగనన్నకు చెబుదాం కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అన్నారు. జిల్లాస్థాయి అధికారులకు ఏమైనా సమస్యలు ఉంటే కలెక్టర్ దష్టికి, రాష్ట్రస్థాయిలో సమస్యలు ఉంటే తన దష్టికి తేవాలన్నారు. సచివాలయ సిబ్బంది అందుబాటులో ఉండాలని గ్రామస్థాయిలోనే సమస్యలు పరిష్కారం జరిగితే జిల్లా స్థాయి వరకు అర్జీదారులు రారన్నారు. కలెక్టర్, జెసి, ఆర్డీవోలు, తహశీల్దార్లు, ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లు సచివాలయాలను విధిగా తనిఖీలు చేయాలన్నారు. సిఎం కార్యాలయం నుంచి ఫిర్యాదుపై నేరుగా అర్జీదారున్నే సమస్య పరిష్కారం అయిందా అని ఫోన్ చేస్తారన్నారు. ఆ స్థాయికి రాకుండా సమస్యలు పరిష్కరించి జిల్లాకు మంచి పేరు తేవాలన్నారు. అర్హుల ఎంపిక పారదర్శకంగా ఉండాలన్నారు. 1902 టోల్ ఫ్రీ నెంబర్ ప్రజలందరికీ తెలిసే విధంగా ప్రచారం చేయాలని, అందుకు గోడ పత్రికలు ప్రదర్శించాలన్నారు. కలెక్టర్ అరుణ్‌బాబు మాట్లాడుతూ గ్రీవెన్స్‌పై నిత్యం పర్యవేక్షణలో ఉన్నామన్నారు. 32 మండలాలకు ప్రత్యేక అధికారులులను నియమించి పథకాలపై పర్యవేక్షిస్తున్నామని తెలియజేశారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ టిఎస్.చేతన్, పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్, డిఆర్ఒ కొండయ్య, సిపిఒ విజయ్ కుమార్, విద్యుత్ ఎస్ఇ మోసెస్, ఆర్డీవోలు భాగ్యరేఖ, రాఘవేంద్ర, డిప్యూటీ కలెక్టర్లు మధులత, భవానీ శంకర్, హౌసింగ్ పీడీ చంద్రమౌళి రెడ్డి, వ్యవసాయ అధికారి సుబ్బారావు, డిపిఒ విజయ్ కుమార్ రెడ్డి, డిఎంహెచ్ఒ కష్ణారెడ్డి, పరిశ్రమల శాఖ అధికారి చాంద్‌బాషా, డిఆర్‌డిఏ పీడీ నరసయ్య పాల్గొన్నారు.

# ఉక్కపోత..!

◆ జిల్లాలో మళ్లీ పెరిగిన ఉష్ణోగ్రతలు
◆ ఎండతక్కువే అయినా ఉక్కపోతలు
◆ ఫ్యాన్ లేకుంటే ఇంట్లో ఉండలేని పరిస్థితి

గత మూడు రోజులుగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలు చోట్ల వర్షం కురిసింది. అంతకుమును భానుడిభగభగలతో సతమతం అయిన ప్రజలకు ఈ వర్షాలు కాస్త ఉపశమనాన్ని ఇచ్చాయి. ఐదు రోజులు పాటు ఎండ అనేది లేకుండా ఉంది. రోజుల వ్యవధిలోనే పరిస్థితుల్లో మార్పులు వచ్చాయి. వెళ్లిపోయిందనుకున్న ఎండలు మళ్లీ వచ్చాయి. బుధవారం నాడు ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు పెరిగాయి. కొన్ని ప్రాంతాల్లో 38, 39 డిగ్రీలకు ఉష్ణోగ్రతలు చేరాయి. ఉక్కపోతలతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఫ్యాన్ ఉంటే తప్పా ఇంట్లో ఉండలేని పరిస్థితి నెలకొంది.





**ప్రజాశక్తి-అనంతపురం**

ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా సూరీడు మళ్లీ సుర్రుమనిపిస్తున్నాడు. ఉదయం 9 గంటల నుంచే వేడిగాలులు వీస్తున్నాయి. ఇంట్లో తీవ్రమైన ఉక్కపోతలు నెలకొన్నాయి. పట్టణ ప్రాంతాల్లో మధ్యాహ్న సమయంలో రోడ్లన్నీ ఖాళీగా కన్పిస్తున్నాయి. బుధవారం నాడు అనంతపురంలో 32 డిగ్రీలు నమోదు అయ్యింది. ఎండవేడిమి కన్పించకున్నా మరో వారం రోజుల పాటు ఉక్కపోతలు ఇలానే ఉండే పరిస్థితి ఉంటుందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. నాలుగు రోజులు క్రితం వర్షం ప్రభావంతో ఎండలు కాస్త తగ్గాయి. దీంతో జనం కాస్త ఊరిపీల్చుకున్నారు. మళ్లీ వేడిగాలులు, ఉక్కపోతలు పెరగడంతో జనజీనవం ఇబ్బందిగా మారింది. సాధారణ ప్రజలతో పాటు వీధి వ్యాపారులు, పనులకు వెళ్లే కార్మికులు, వ్యవసాయ కూలీలు ఎండతీవ్రతకు పని ప్రాంతాల్లో ఉండలేని పరిస్థితి కన్పిస్తోంది. చిన్నారులు వృద్ధులు ఉక్కపోతతో అల్లాడుతున్నారు. రాత్రి వేళ కూడా ఉక్కపోతలతో ఇంట్లో ఉండలేని పరిస్థితులు నెలకొన్నాయి. కరెంట్‌లేకపోతే పరిస్థితి మరింత దారుణంగా ఉంటోంది. అక్కడకక్కడ కొన్ని ప్రాంతాల్లో మేఘామృతం అయి ఉన్నా ఉక్కపోతలు మాత్రం తగ్గలేదు.

**మరో కొన్ని రోజులు ఇదే పరిస్థితి...**

ఉక్కపోతలు మరో ఐదు రోజుల పాటు ఇలాగే ఉంటుందని వాతవరణ నిపుణులు తెలియజేస్తున్నారు. వడగాల్పులు, ఉక్కపోతలు తీవ్రత ఎక్కువగా ఉన్నందన జనం జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. మధ్యాహ్న సమయంలో బయటకు రాకపోవడం మంచిదని సూచిస్తున్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు బయట తిరగపోవడమే మంచిదని చెబుతున్నారు. ఉక్కపోతల నుంచి ఉపశమనం పొందేందుకు చల్లిటి ప్రాంతాల్లో ఉండాలని సూచిస్తున్నారు.

# తాగునీటి కోసం రోడ్డెక్కిన గ్రామస్తులు


ఖాళీబిందెలతో రాస్తారోకో చేస్తున్న గ్రామస్తులు

**ప్రజాశక్తి -పెనుకొండ**

నగరపంచాయితీ పరిధిలోని తిమ్మాపురం, ఇస్లాపురం, వెంకటరెడ్డి పల్లి గ్రామాల్లో నెలకొన్న నీటిఎద్దడిని నివారించాలని డిమాండ్‌తో సిపిఎం, టిడిపి ఆధ్వర్యంలో ఆయా గ్రామాల ప్రజలు, మహిళలు బుధవారం రాస్తారోకో నిర్వహించారు. గంటపాటు ఖాళీ బిందెలతో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మూడు గ్రామాలకు నీరు అరకొరగా వస్తున్నాయన్నారు. నీటికోసం ఆయా గ్రామాల ప్రజలు ప్రతి రోజు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకుపోయినా పట్టించుకోలేదని విమర్శించారు. దీంతో తప్పనిసరి పరిస్థితులతో గ్రామస్తులు రోడ్డెక్కాల్సివచ్చిందని అన్నారు. రాస్తారోకో విషయం తెలుసుకున్న ఎస్ఐ రమేష్ బాబు నాయకులు, ఆయా గ్రామాల ప్రజలతో మాట్లాడారు. తమ సమస్య పరిష్కారం చేసేంతవరకు ఆందోళన కొనసాగిస్తామని వారు తెగేసి చెప్పారు. దీంతో సమస్యను నగర పంచాయతీ కమిషనర్ వంశీకృష్ణ భార్గవకు తెలిపారు. ఒక్కరోజులోగా నీటి సమస్య పరిష్కారం చేస్తానని హామీ ఇవ్వడంతో రాస్తరోకో విరమించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి రమేష్, నియోజకవర్గ మైనార్టీ నాయకులు రియాజ్‌బాషా, 1,3 వార్డు కౌన్సిలర్లు గీతా హనుమంతు, గిరి, సిఐటియు నాయకులు మహబూబ్‌బాషా, వజ్రం నాగప్ప, హమాలీబాషా, హనుమంతు, సత్యం, శ్రీరాములు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## వక్ఫ్‌బోర్డు భూములను స్వాధీనం చేసుకోవాలి

**ప్రజాశక్తి - కదిరి టౌన్**

కదిరి పట్టణంలోని వక్ఫ్ బోర్డు భూములను వక్ఫ్‌బోర్డు ఆధీనంలోకి తీసుకోవాలని వైసిపి కదిరి పట్టణ అధ్యక్షులు బాహుద్దీన్ కోరారు. ఈ మేరకు విజయవాడలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు మైనారిటీ వ్యహరాల డాక్టర్ ఎస్ ఎం జియావుద్దీన్‌ను, రాష్ట్ర ప్రభుత్వ మైనారిటీ వ్యవహారాల కార్యదర్శి ఇంతియాజ్‌ను, రాష్ట్ర వక్ఫ్ బోర్డు ప్రత్యేక అధికారి షిరీన్ బేగంను, ఇన్‌ఛార్జి సిఇఒ నూర్ అహ్మద్‌ను వారివారి కార్యాలయంలో విడి విడిగా కలిసి వినతిపత్రాలు అంజేశారు. ఈ సందర్భంగా బాహుద్దీన్ మాట్లాడుతూ కదిరి పట్టణంలోని ఈద్గా, ఖబరస్థాన్ చెందిన భూమిని వక్ఫ్ బోర్డ్ ఆధీనంలోకి తీసుకోవాలన్నారు. అక్కడ కొంతమంది స్వార్థపరుల అక్కడి ఆదాయాన్ని సొంతానికి వాడుకుంటున్నారని దీనిని అరికట్టి ప్రభుత్వానికి వచ్చే ఆదాయం ద్వారా ముస్లింల సంక్షేమం కోసం ఉపయోగించాలని డిమాండ్ చేశారు. కుటాగుళ్ల రైల్వే గేట్ దగ్గర నిర్మించ తలపెట్టిన ఫ్లై ఓవర్ వల్ల కోల్పోతున్న సర్వే నెంబర్ 407, 408, 400 ఏ లో ఉన్న 500 సంవత్సరాల చరిత్ర గల ఈద్గా, ఖబరస్థాన్, జహీరోద్దీన్ బాబా దర్గా, అక్రమ్ షా వలి దర్గా లకు సంబంధించిన భూములను కాపాడాలని కోరారు. కదిరి పట్టణం, నియోజకవర్గం లోని వందల ఎకరాల వక్ఫ్‌బోర్డు భూమి కబ్జాదారుల చేతుల్లోకి వెళ్లిందని వాటిని కాపాడేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అధికారులు సానుకూలంగా స్పందించాలని కోరారు.

# బీటెక్ ఫలితాలు విడుదల


బీటెక్ ఫలితాలను విడుదల చేస్తున్న జెఎన్‌టియు విసి.రంగజనార్ధన్, అధ్యాపక సిబ్బంది

**ప్రజాశక్తి-అనంతపురం**

జెఎన్‌టియు పరిధిలో బీటెక్ ఫలితాలను జెఎన్‌టియు ఉపకులపతి ఆచార్య రంగజనార్ధన బుధవారం సాయంత్రం విడుదల చేశారు. బీటెక్ నాలుగవ సంవత్సరం రెండవ సెమిస్టర్ (ఆర్-19) రెగ్యులర్, (ఆర్-15) సప్లిమెంటరీ పరీక్షా ఫలితాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ బీటెక్ నాలుగవ సంవత్సరం రెండవ సెమిస్టర్ (ఆర్-19) రెగ్యులర్ పరీక్షలకు 14,508 మంది హాజరవ్వగా 13,137 మంది ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. 90.55 శాతం విద్యార్థులు ఉత్తీర్ణులు అయ్యారని చెప్పారు. ఇందులో బాలురు 7,888 మంది హాజరవ్వగా 6,836, విద్యార్థినులు 6,620 మంది హాజరవ్వగా, 6,301 మంది ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. పరీక్ష ఫలితాలకు సంబంధిత రీకౌంటింగ్ ఫొటో కాపీ, ఛాలెంజ్ వాల్యూయేషన్‌కు నోటిఫికేషన్ జారీ చేస్తున్నామని చెప్పారు. గురువారం నుంచి వీటిని దరఖాస్తుచేసు కోవచ్చనని తెలిపారు. బీటెక్ నాలుగవ సంవత్సరం రెండవ సెమిస్టర్ (ఆర్-19) పరీక్షకు సంబంధించిన అడ్వాన్స్ సప్లిమెంటరీ నోటిఫికేషన్‌ను జారీ చేస్తున్నామని తెలిపారు. ఈ నెల 25వ తేదీ నుంచి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎంబిఎ మూడవ సెమిస్టర్ (ఆర్-21) రెగ్యులర్, (ఆర్-17) పరీక్షా పలితాలను విడుదల చేశామన్నారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఎం.విజయ కుమార్, రిజిస్ట్రార్ సి.శశిధర్, వర్సిటీ అకడమిక్ డైరెక్టర్ వి.సుమలత, పరీక్షలు విభాగం డైరెక్టర్ ఇ.కేశవ రెడ్డి, కంట్రోలర్ బి.చంద్రమోహన్ రెడ్డి , అడిషినల్ కంట్రోలర్స్ డాక్టర్ యం.రామ శేఖరరెడ్డి, కె.జయలక్ష్మి , డాక్టర్ జితేంద్ర గౌడ్, డాక్టర్ శ్రీధర్, డిప్యూటి రిజిస్ట్రార్లు యన్.మధుసూధన రెడ్డి, ఎస్.రంగా నాయక్ పాల్గొన్నారు.

## రైల్వే ఆస్తులను ధ్వంసం చేస్తే చర్యలు

**ప్రజాశక్తి కదిరి అర్బన్**

ఈ మధ్యకాలంలో రైళ్లపై రాళ్లు వేయడం వాటిని ధ్వంసం చేయడం రైల్వే అధికారులకు తప్పుడు సమాచారాన్ని ఇచ్చి ఇబ్బందులు పెట్టడం లాంటి వాటికి పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామనిరైల్వే సర్కిల్ ఇన్స్‌పెక్టర్ బి కుమార్ తెలిపారు .బుధవారం కదిరి రైల్వే స్టేషన్ ఆవరణంలోని వారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.కొంతమంది ఆకతాయిలు రైళ్లపై రాళ్లు వేయడం, పట్టాల మీద కూర్చోవడం, తప్పుడు సమాచారం ఇచ్చి ప్రయాణికులకు ఇబ్బంది పెట్టడం లాంటి చర్యలకు పాల్పడుతున్నారన్నారు. సెంట్రల్ రైల్వే శాఖ చట్టాల ప్రకారం వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ మధ్యకాలంలో జరిగిన సంఘటనలను పునరావృతం కాకుండా నివారించేందుకే పై అధికారుల ఆదేశాల మేరకు పలు అవగాహన కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ సమావేశంలో ఎస్ఐ శివారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న రైల్వే సిఐ

# 'డిగ్రీ' వసతి గృహాలను కొనసాగించాలి : ఎస్ఎఫ్ఐ

**ప్రజాశక్తి-హిందూపురం**

శ్రీ కృష్ణ దేవరాయ విశ్వ విద్యాలయ పరిధిలోని డిగ్రీకళాశాలకు అనుబంధంగా ఉన్నా అన్ని సంక్షేమ వసతి గృహాలను కొనసాగించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బాబావలి డిమాండ్ చేశారు. బుధవారం ఈ విషయంపై తహశీల్దార్ కార్యాలయం ముందు ఆందోళన చేసి, డిప్యూటి తహశీల్దార్ ప్రసాద్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బాబావలి మాట్లాడుతు కరువుకు నిలయమైన ఉమ్మడి అనంత జిల్లాల పేద, మధ్య తరగతి విద్యార్థులు సంక్షేమ వసతి గృహాలపైనే ఆధారపడి చదువును కొనసాగిస్తున్నారన్నారు. అయితే ఎస్.కె యూనివర్సిటీ పరిధిలో ఉన్న డిగ్రీ కళాశాలలో 1, 3, 5 సెమిస్టర్ పూర్తి చేసిన అనంతరం 2, 4, 6 సెమిస్టర్ల కోసం యూనివర్సిటీ అనుబంధంగా ఉన్న డిగ్రీ కళాశాలలో పాఠాలు చెప్పడం ప్రారంభించారన్నారు. బీసీ, ఎస్టీ, ఎస్సీ వెనకబడినటువంటి సంక్షేమ హాస్టల్స్‌లో చదువుతున్న విద్యార్థులందరికి వసతి గృహ సంరక్షణ అధికారులు వసతి గృహం నుంచి బయటకు వెళ్లాలని సర్క్యులర్లు ఇచ్చారన్నారు. దీంతో వసతిగృహాలపై ఆధారపడి చదువుతున్న విద్యార్థులందరు చదువుకు దూరం అవ్వాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇది సరైన పద్ధతి కాదన్నారు. వెంటనే వసతి గృహాలను ప్రారంభించాలని, లేని పక్షంలో ప్రవేటు వసతి గృహాల్లో విద్యార్థులు ఉండడానికి అనుమతులు ఇచ్చి, దానికి నిధులను ప్రభుత్వం ముందస్తుగా మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు చంద్రశేఖర్, నిహాల్, హర్షకుమార్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు


జిల్లా గ్రంథాలయంలో పరీక్షలు రాస్తున్న చిన్నారులు

# సమ్మర్ క్యాంప్‌కు విశేష స్పందన

**ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్**

జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్‌కు విద్యార్థుల అధిక సంఖ్యలో హాజరవుతుండటంతో విశేష స్పందన లభించింది. జిల్లా వ్యాప్తంగా ఆయా మండల శాఖ గ్రంథాలయాల్లో సమ్మర్ క్యాంపులకు విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా హాజరవుతున్నారు. జిల్లా కేంద్రంలోని గ్రంథాలయంలో బుధవారం నిర్వహించిన మూడవ రోజు సమ్మర్ క్యాంప్‌ను మాజీ వ్యవసాయ శాఖ సలహాదారు అంబటి కృష్ణారెడ్డి దంపతులు హాజరై విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్ఎం.ఉమామోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఉచిత వేసవి శిక్షణా శిబిరానికి విద్యార్థులు హాజరై ఎంతో ఉత్సాహంగా పోటీల్లో పాల్గొంటున్నారని తెలిపారు. వేసవి దృశ్య పిల్లలకు ఉదయం 8 నుంచి 9 గంటల వరకు యోగా, 9 నుంచి 10 గంటల వరకు కథలు చెప్పడం, 10 నిమిషాలు విరామం. 10:10 నుంచి 11 గంటల వరకు డ్రాయింగ్, 11 నుంచి 12 గంటల వరకు పుస్తక సమీక్ష నిర్వహించినట్లు తెలిపారు. 70 మంది విద్యార్థులు శిక్షణలో హాజరయ్యారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి.రమ, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎల్ఎం.మోహన్‌రెడ్డి, ఉప గ్రంథాలయ అధికారిని వి.సుబ్బరత్నమ్మ, గ్రంథాలయ సిబ్బంది ఇంతియాజ్, కావేరి, హేమమాలిని, మల్లికార్జున, ఉజ్జినేశ్వరి, విద్యార్థులు, వారి తల్లి దండ్రులు తదితరులు పాల్గొన్నారు

# ప్రశాంతంగా పాలిసెట్

**ప్రజాశక్తి-హిందూపురం**

ప్రభుత్వ, ప్రయివేటు పాలిటెక్నిక్ కళాశాలల్లో 2023-24 విద్యా సంవత్సరానికి గాను ప్రవేశాలకు బుధవారం నిర్వహించిన పాలిసెట్ పరీక్షలు పట్టణంలోని ప్రశాంతంగా జరిగాయి. ఈ సందర్భంగా హిందూపురం పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్, పాలిసెట్ కో ఆర్డినేటర్ హరీష్‌బాబు మాట్లాడుతు హిందూపురంలో 2567 మంది హాజరు కావాల్సి ఉందన్నారు. దీని కోసం పట్టణంలో మొత్తం మొత్తం ఏడు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. మొత్తం 2567 హాజరు కావాల్సి ఉంటే 2303 మంది విద్యార్థులకు పరీక్షకు హాజరు అయినట్లు తెలిపారు. పరీక్షలు అన్ని కేంద్రాల్లోను ప్రశాంతంగా నిర్వహించామన్నారు. పరీక్షలు సజావుగా జరగాడానికి సహకరించిన అన్ని శాఖల అధికారులకు వారు కృతజ్ఞతలు తెలిపారు.


పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

**ధర్మవరం టౌన్ :** పట్టణంలోని 9 కేంద్రాలలో బుధవారం జరిగిన పాలిటెక్నిక్ ప్రవేశపరీక్షలు సజావుగా జరిగాయి. ఈ పరీక్షా కేంద్రాలను స్పెషల్ ఇన్విజిలేషన్ స్క్వాడ్ ఈశ్వరయ్య పరిశీలించారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తుతో పాటు వైద్యసదుపాయాలు ఏర్పాటుచేశారు. మొత్తం 9 కేంద్రాలలో 2403 మందికి విద్యార్థులకు గాను 2198 మంది పరీక్షలకు హాజరయ్యారు.

## సదస్సును విజయవంతం చేయండి

**ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్**

ఎపి జెఎసి అమరావతి ఆధ్వర్యంలో ఈ నెల 17న అనంతపురంలో జరిగే రెండవ సదస్సును విజయవంతం చేయాలని శ్రీ సత్యసాయి జిల్లా ఎపి జెఎసి అమరావతి సంఘ సభ్యులు కోరారు. ఈ సందర్భంగా పుట్టపర్తిలో ప్రభుత్వ కార్యాలయంలో పనిచేసే అధికారులను, సిబ్బందిని బుధవారం కలసి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర అధ్యక్షులు ఉప్పరాజు వెంకటేశ్వర్లు హాజరు కానున్నారని తెలిపారు.జిల్లా పునర్విభజన నాటి నుండి నేటి వరకు కొత్త జిల్లాలో మౌలిక సదుపాయాల కోసం ఉద్యోగుల సంక్షేమం కోసం పాత జిల్లాల ప్రాతిపదికనే అన్ని సమకూర్చాలని, హౌస్ అలవెన్సులు పెంచాలన్న డిమాండ్లతో సదస్సు నిర్వహించనున్నామని దీనికి తప్పక హాజరుకావాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఎపి జెఎసి శ్రీ సత్యసాయి జిల్లా చైర్మన్ మైనుద్దీన్, జాయింట్ సెక్రటరీ కె నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

# మినీ గోకులాలు కనుమరుగు




కదిరి పశువైద్యశాల

**ప్రజాశక్తి - కదిరి అర్బన్**

రైతుల ప్రభుత్వమని గొప్పలు చెప్పుకుంటున్న వైసిపి కేవలం ప్రకటనకే పరిమితమైందన్న విమర్శలు వినపడుతున్నాయి. టిడిపి హయాంలో రైతుల అభివృద్ధి కోసం 2018లో ప్రవేశపెట్టిన మినిగోకులం పథకాన్ని వైసిపి ప్రభుత్వం కనుమరుగు చేసింది. పాడిపరిశ్రమ అభివృద్ధికి పాడిరైతులు చేపట్టే షెడ్ల నిర్మాణానికి ఈ మినీగోకులం పథకం వర్తిస్తుంది. మినీ గోకులం షెడ్లు నిర్మించుకోవాలనుకునే రైతులు 10 శాతం వారి వాటా ప్రభుత్వ పశువైద్యాధికారి ద్వారా చలానాను కట్టాలి. మిగిలిన మొత్తాన్ని ప్రభుత్వం మంజూరు చేస్తుంది. అప్పటి టిడిపి ప్రభుత్వంలో ఈ పథకానికి ఎంపికైన రైతులకు ఇప్పటికీ నిధులు మంజూరుకాలేదు. ఆయా మండలాలలో రైతులు చెల్లించిన 10 శాతం వాటా మొత్తం ఏమైందో నేటికీ సమాధానం చెప్పేవారు కరువయ్యారు. షెడ్ల నిర్మాణం చేసుకున్న వారికి ఖర్చుపెట్టిన మొత్తాన్ని కూడా ఇంతవరకు ఇవ్వలేదని బాధితులు వాపోతున్నారు. రాష్ట్రంలో వైసిపి అధికారం చేపట్టాక ఈ పథకం పూర్తిస్థాయిలో నిర్వీర్యం అయిపోయిందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా పాడి పరిశ్రమ రైతులు పశువుల కోసం షెడ్లు నిర్మించుకోవడానికి గత ప్రభుత్వం దాదాపు రెండు లక్షల రూపాయల ప్రకారం ఇవ్వాలని ఉద్దేశంతో ఈ పథకానికి ఊపిరి పోసింది. ఈ పథకాన్ని కొత్తగా ప్రవేశపెట్టిన రోజుల్లో ఉత్సాహంగా రైతులు ముందుకు వచ్చి మినీగోకులం షెడ్లు నిర్మించుకోవడానికి ముందుకు వచ్చారు. అయితే ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంతోనే ఈ పథకం కనుమరుగైంది. కొన్ని మండలాలలో అప్పులు చేసి పది శాతం మొత్తాన్ని ప్రభుత్వానికి చెల్లించిన రైతులకు మొండిచెయ్యి చూపారు. మినీ గోకులం షెడ్ లో పథకం ప్రవేశపెట్టిన రోజుల్లో దాదాపు 1200 మంది రైతులు దరఖాస్తు చేసుకుంటే వాటిలో 650 మంది రైతులను ఎంపిక చేసినట్లు సమాచారం. దరఖాస్తు చేసుకున్న కొంతమంది రైతులు 10 శాతం మొత్తాన్ని చెల్లించారు. వీరిలో కొంతమందికి మాత్రమే అరకొరగా నిధులు ఇచ్చారు., పూర్తిస్థాయిలో ఇప్పటికీ పాడిరైతులకు ఈ పథకం ద్వారా నగదు అందలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, పాలకులు స్పందించి మినీ గోకులం పథకం అమలు చేయాలని, బాధిత పాడిరైతులకు న్యాయం చేయాలని పాడి పరిశ్రమ రైతులు కోరుతున్నారు.

## మారెమ్మ జాతర

**మడకశిర రూరల్** : మండలంలోని కదిరేపల్లి పంచాయతీ గుర్రపుకొండ గ్రామంలో మడకలకకుంట మారెమ్మ జాతరను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్ మూర్తి, బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, పాండు, బూత్ ఇన్‌ఛార్జి రవికుమార్, నాగేంద్ర, తిప్పేస్వామి, నాగేంద్రప్ప, జయప్ప, రమేష్, కదిరేపల్లి బూత్ ఇన్‌ఛార్జి రంగదామప్ప, శ్రీరామప్ప, కృష్ణ, బలరామప్ప, రంగప్ప తెలుగుదేశం పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బ్రహ్మరథోత్సవం

**పెనుకొండ :** పట్టణంలోని శ్రీలక్ష్మీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మరథోత్సవము బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వెచ్చం అమర్నాథ్ కుటుంబ సభ్యులు సుమన్, డాక్టర్ రత్నాకర్, డాక్టర్ పవన్ కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో ప్రగతి శ్రీనివాసులు, యాడికి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి సమస్య పరిష్కారం

**లేపాక్షి :** లేపాక్షి పంచాయతీ పరిధిలోని వీవర్స్ కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్యను ఆ గ్రామ సర్పంచి పరిష్కరించారు. సమస్యను తెలుసుకున్న సర్పంచి ఆదినారాయణ నూతన బోరు బావి తవ్వించి, పంపు మోటారును అమర్చారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు సర్పంచి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి చలపతి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## వైసిపి ప్రభుత్వాన్ని సాగనంపుదాం

**రొద్దం :** వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపుదామని టిడిపి నాయకులు అన్నారు. మండలంలోని క్లస్టర్ ఇంచార్జ్ 1 నాగేంద్ర ఆధ్వర్యంలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో గ్రామ నాయకులు నాగరాజు, మల్లేష్, గోపాల్, గోపాల్, రాము, రవీంద్రారెడ్డి, నాగరాజు, నాయక్, రవినాయక్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ నిర్మాణానికి స్థలం దానం

**ధర్మవరం టౌన్ :** తన తల్లిదండ్రుల పేరు మీద పట్టణంలోని కట్టకిందగల సొంత స్థలాన్ని ఆలయ నిర్మాణానికి విరాళంగా ఇస్తున్నట్టు బెస్తశ్రీనివాసులు తెలిపారు. బుధవారం నిర్వహించిన సమావేశంలో బెస్త సేవాసంఘం అధ్యక్షులు దత్తశివ మాట్లాడుతూ గంగమ్మ ఆలయానికి, కమ్యూనిటిహాల్ నిర్మాణానికి బెస శ్రీనివాసులు స్థలాన్ని విరాళం ఇవ్వడం అభినందనీయమన్నారు. అదేవిధంగా 10వతరగతిలో 500కంటే ఎక్కువ మార్కులు సాధించిన తమ సామాజికవర్గానికి చెందిన విద్యార్థులను సత్కరించాలని నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఈనెల 20తేదీలోగా దత్తశివ (సెల్ నెంబర్ 9248911111) సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో బెస్త సేవాసంఘం పట్టణ ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, సభ్యులు వెంకటరమణ, ఆదినారాయణ, వెంకటేశ్, రాధాకృష్ణ, విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## బస్సు సర్వీసులు ప్రారంభం

**కదిరి టౌన్ :** కదిరి డిపో నుండి నూతనంగా ప్రవేశపెట్టిన "ఇంద్ర"ఎసి బస్సును కదిరి బస్టాండులో ఎమ్మెల్యే పివి.సిద్దారెడ్డి, కడప జోన్ ఆర్టీసీ చైర్‌పర్సన్ మాల్యవంతం మంజుల బుధవారం ప్రారంభించారు. ఇదివరకు కదిరి డిపో నుండి రెండు సూపర్ లగ్జరీ సర్వీసులు వుండేవని, ఇప్పుడు అదనంగా ప్రయాణికులకొరకు ఇంద్ర బస్సు ప్రవేశపెట్టామని చెప్పారు. కదిరి డిపోకు ఇంకా నూతన బ్రాండ్ బస్సులను తెప్పించేందుకు కృషి చేస్తామని హామీఇచ్చారు. శ్రీ సత్యసాయి జిల్లాలో అతి పెద్దడిపో కదిరి డిపోనేనని చైర్ పర్సన్ మాల్యవంతం మంజుల తెలిపారు. వేసవిలో విహార యాత్రలకు,పుణ్యక్షేత్రములకు మంచి బస్సులు ఇవ్వగలమని చైర్‌పర్సన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిపోమేనేజరు బి.మైనోద్దీన్, కదిరిడిపో అసిస్టెంట్ మేనేజరు హరిమోహన్, ట్రాఫిక్ అధికారులు ఆర్.నాగసుబ్బయ్య, ఉత్తన్న, అసోషియేషన్ నాయకులు బైరిశెట్టి, ఎన్‌వి.రమణ, గంగాద్రి, అక్కులప్ప తదితరులు పాల్గొన్నారు.

## వడ్డీ చెల్లింపుతో పంటరుణాలు రెన్యువల్ చేయాలి

**బత్తలపల్లి :** ఖరీఫ్ సీజన్‌కు సంబందించిన పంటరుణాలకు సంబందించి వడ్డీ మొత్తం చెల్లించి రెన్యూవల్ చేయాలని సిపిఐ నాయకులు బ్యాంక్ మేనేజర్ ను కలసి విజ్ఞప్తి చేశారు. బుధవారం మండల కేంద్రమైన బత్తలపల్లిలోని యూనియన్ బ్యాంక్ మేనేజర్‌ను ఏపీ రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కమతం కాటమయ్య, వ్యవసాయ కార్మిక సంఘం సహాయ కార్యదర్శి కుళ్లాయప్ప,సిపిఐ మండల కార్యదర్శి బండల వెంకటేశు తదితరులు కలసి రైతుల స్థితిగతులను, కష్టసుఖాలను వివరించారు. రైతుల కష్టాలను గుర్తించి కేవలం పంట రుణాల వడ్డీ మాత్రమే కట్టించుకుని రెన్యూవల్ చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం రైతుల సమస్యలపై బ్యాంక్ మేనేజర్ కు వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో రైతులు చలపతి, వన్నూరప్ప, రామాంజినేయులు, మాలపాటి ఆదెప్ప, బోయపాటి రామాంజినేయులు, మందల నరేష్, ఓబిలేష్, పలువురు రైతులు పాల్గొన్నారు.

## ఎంఆర్‌పిఎస్ జిల్లా కన్వీనర్‌గా ఓబులేసు

**పుట్టపర్తి అర్బన్ :** రాష్ట్ర ఎంఆర్‌పిఎస్ కార్యవర్గ సమావేశంలో పుట్టపర్తికి చెందిన ఎంవైపి ఓబులేసు సత్యసాయి జిల్లా కన్వీనర్‌గా ఎంపికయ్యారు. ఈసందర్భంగా ఓబులేసు బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఉసిరిపాటి బ్రహ్మయ్య మాదిగ ఆధ్వర్యంలో గుంటూరులో ఈ ఎన్నిక జరిగిందన్నారు. జిల్లా కో కన్వీనర్ గా సాకే సంజీవ్‌ను, జిల్లా ఇన్‌ఛార్జిగా ఎన్ రవిని ఎన్నుకున్నారన్నారు. తమ ఎంపికకు సహకరించిన రాష్ట్ర నాయకులకు కతజ్ఞతలు తెలుపుతూ, ఎంఆర్‌పిఎస్ బలోపేతానికి, మాదిగల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఓబులేసు తెలిపారు.

## సునీల్‌కుమార్‌కు డాక్టరేట్

**అనంతపురం :** నగరంలోని ప్రభుత్వ వైద్య కళాశాల మైక్రో బయాలజీ డిపార్ట్‌మెంట్‌లో ట్యూటర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఏ.సునీల్ కుమార్ చెన్నైలోని సవిత యూనివర్సిటీ నుంచి మెడికల్ మైక్రోబయాలజీ విభాగంలో పి.హెచ్.డి డాక్టరేట్ పొందారు. ఈయన సవిత డెంటల్ కాలేజీలోని మైక్రో బయాలజీ ప్రధాన విభాగాధిపతి డాక్టర్ స్మైలీన్ గిరిజ ఆధ్వర్యంలో పిహెచ్‌డి డాక్టరేట్ పొందారు. 'ఫీనో టైపిక్ అండ్ జీనో టైపిక్ క్యారెక్టరైజేషన్ ఆఫ్ మితిసిలిన్ రెసిస్టెంట్ అండ్ బయోఫిల్మ్ ప్రొడ్యూసింగ్ కోయాగులేజ్ నెగిటివ్ స్టాఫైలో కోకై ఫ్రమ్ క్లినికల్ స్పెసిమెన్స్ విత్ స్పెషల్ ఎంఫసైజ్ ఆన్ ద యాంటీ మైక్రోబియల్ ఎఫెక్ట్ ఆఫ్ ఇల్లుసీఎం వెరుమ్ బై ఇన్ విట్రో అండ్ సిలికో అనాలిసిస్' టాపిక్‌పై డాక్టర్ సునీల్ కుమార్ పరిశోధనలు చేశారు.

## పేదలకు అన్నదానం

**అనంతపురం :** నిత్య సురభి చారిటబుల్ ట్రస్ట్, పుట్టినిల్లు ఆశ్రమం సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం నగరంలోని ప్రభుత్వాసుపత్రి వద్ద పేదలకు ట్రస్ట్ చైర్‌పర్సన్ డాక్టర్. ఎస్.నిర్మలమురళి అన్నదానం చేశారు. టుంకూరుకు చెందిన ఎన్ఎస్.శ్రేయాస్, ఎన్.ఎస్. వైష్ణవి దంపతుల కుమారుడు ఎన్.ఎస్. శౌర్య పుట్టినరోజు సందర్భంగా అన్నదానం చేసినట్లు ఆమె తెలిపారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా పేదలకు అన్నదానం చేయాలని కోరారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు సుబ్రహ్మణ్యం, సుబ్బారావు, కిష్టప్ప, ఓబుళపతి, చంద్రశేఖర్, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



## పదిలో మెరిసిన కెజిబివి విద్యార్థులు

**ప్రజాశక్తి - రొద్దం**

పదవ తరగతి ఫలితాల్లో కేజీబీవీ పాఠశాల విద్యార్థులు ప్రభంజనం సష్టించారు. ఈ పాఠశాలలో 35 మంది విద్యార్థులు గాను 28 మంది విద్యార్థులు పాసయ్యారని ఎస్ఒ నాగరత్నమ్మ తెలిపారు. ఇందులో ఏడుగురు విద్యార్థులు 500 పైగా మార్కులు సాధించారన్నారు. 25 మంది విద్యార్థులు ఫస్ట్ క్లాస్ తో పాస్ అయ్యారని చెప్పారు. పాఠశాలలో ఎప్పుడు లేనంత ఉత్తీర్ణత సాధించినట్లు ఆమె తెలిపారు. సుస్మిత 543, భార్గవి 539, కోమల 535, లత 520, పుష్పలత 520, గాయత్రి 518, 7.సంగీత 504 మార్కుల సాధించారు. ప్రతిభా విద్యార్థులను ఎస్ఒ నాగరత్న, కళాశాల సిబ్బంది అభినందించారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

**ప్రజాశక్తి - మడకశిర రూరల్**

ప్రజల సమస్యల పరిష్కారానికి ఆయా సచివాలయాల అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో సోనియా బాయ్ ఆదేశించారు. ఈ మేరకు ఆమె మడకశిర మండలం గుండుమల గ్రామ సచివాలయాన్ని బుధవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ ముఖ్యమంత్రి అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి లబ్ధిదారునికి అందేలా పనిచేయాలని ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్డీ శైలజ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ

## పది పరీక్షల్లో 'సాధన' ఉత్తమ ఫలితాలు

**ప్రజాశక్తి ధర్మవరం టౌన్**





ప్రతి విద్యార్థి లక్ష్యంతో ముందుకు వెళితే తప్పక ఫలితం లభిస్తుందని, పదోతరగతి పరీక్ష ఫలితాల్లో తమ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని సాధన ఇంగ్లీషుమీడియం పాఠశాల కరెస్పాండెంట్ సీతాపతి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన బుధవారం మాట్లాడుతూ కాయగూరల మార్కెట్ వద్ద గల తమ సాధన ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలలో 63 మందికి గాను 54 మంది విద్యార్థులు పదోతరగతి పరీక్ష ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించారన్నారు. ఇందులో జి. మౌనిక 567, జిఎస్. హాఫ్‌షా 563, జె. స్వాతి 562 మార్కులను సాధించారన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను పాఠశాలకరస్పాండెంట్ సీతాపతి, హెడ్మాస్టర్ భువనేశ్వరితో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

## 'జగనన్నకు చెబుదాం'ను సద్వినియోగం చేసుకోండి : కలెక్టర్

**ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్**

జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పి మాధవరెడ్డి పిలుపునిచ్చారు. ప్రత్యేక అధికారి చక్రధర్ బాబు జిల్లా అధికారులతో బుధవారం నిర్వహించిన సమావేశం అనంతరం కలెక్టర్, ఎస్పి స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వ లక్ష్యాన్ని సాధిస్తామన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి మానిటర్ చేసే పరిస్థితి ఉందని, ప్రభుత్వం ఆదేశించిన స్థాయిలో జిల్లా కార్యక్రమం చేపడతామని అన్నారు. గత ఆరు నెలలుగా స్పందన గ్రీవెన్స్ పై చేసిన సమీక్ష వల్ల జిల్లాలో మరింత మెరుగైన సేవలు అందించడానికి అవకాశం ఏర్పడిందని అన్నారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కాకుంటే 1902 టోల్ ఫ్రీ కి ఫోన్ చేయవచ్చన్నారు. ఎస్పి మాట్లాడుతూ గ్రీవెన్స్ కు నాణ్యమైన పరిష్కారం అందించడానికి వ్యక్తిగతంగా మానిటర్ చేస్తామన్నారు. పోలీస్ శాఖ పరిధిలో అత్యంత ప్రతిష్టాత్మకంగా జగనన్నకు చెబుదాం కార్యక్రమం అమలు చేయడం జరుగుతుందన్నారు. అర్జీదారులకు సంతృప్తి కలిగే విధంగా పనిచేస్తున్నామన్నారు.

## ముగిసిన ఉరుసు ఉత్సవాలు

**ప్రజాశక్తి-హిందూపురం**

హిందూపురం పట్టణ సమీపంలో లేపాక్షి మండలం కల్లూరు గ్రామ సమీపంలో వెలసిన హజరత్ సయ్యద్ మహమ్మద్ యూసుఫుల్లా షా కమాల్ పోషా ఖాద్రి స్వామి ఉరుసు ఉత్సవాలు బుధవారం రాత్రి ముగిసాయి. సోమవారం రాత్రి మత గురువులతో ఆధ్యాత్మిక సభను నిర్వహించారు. అనంతరం సజ్జదే నిషాన్ సయ్యద్ రఫీవుల్లా షా కమల్ పోషా ఖాద్రి, మస్థాన్ కమల్ ఫాషా ఖాద్రి వారిచే భారీ ఊరేగింపుతో గంధోత్సవ వేడుకలు జరిగాయి. మంగళవారం రాత్రి నాసీర్ అలీ చిస్తీ వారిచే ఖవాలి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు రెండు రోజుల పాటు నిర్వహకుల ఆద్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో అశ్వర్థనారాయణ స్వామి, ఉమర్ అలిసా, ఫరీదుల్లా షా, ఆదిమూర్తి, అంబికా లక్ష్మినారాయణ షాబుద్దీన్ షా ఖాద్రి, మహాబూబ్ దౌలతో పాటు పెద్ద ఎత్తున వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పాల్గొన్నారు.



ప్రత్యేక ప్రార్థనల్లో ముస్లిం సోదరులు

## వాలంటీర్లకు ఉన్న విలువ ప్రజాప్రతినిధులకు లేదు..

### అధికార పార్టీ ఎంపిటిసిల ఆవేదన

**ప్రజాశక్తి-కణేకల్లు**

గ్రామంలో వాలంటీర్లకు ఉన్న విలువ సర్పంచి, ఎంపిటిసిలకు లేదని అధికార పార్టీ ప్రజాప్రతినిధులే మండల సమావేశంలో పేర్కొనడం శోచనీయం. ప్రజల సమస్యలు పరిష్కరించలేని సమావేశాలు నిర్వహంచడం ఎందుకని మండల పరిధిలోని ఎన్.హనుమాపు రం గ్రామ సర్పంచి జయరాం చౌదరి, ఎంపిటిసి నరేంద్ర అధికారులను ప్రశ్నించారు. స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ సంధ్య అధ్యక్షతన మండల సర్వసభ సమావేశం నిర్వహించగా సర్పంచితో పాటు అధికార పార్టీ ప్రజా ప్రతినిధులు, మండల అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్పంచి, ఎంపిటిసి మాట్లాడుతూ ఎన్.హనుమాపురం గ్రామంలో నెలకొన్న సమస్యలను అధికారులు పట్టించుకోవడం లేదని, గ్రామానికి సంబంధిం చి ఎలాంటి సమావేశం నిర్వహించినా కనీస సమాచాచం ఇవ్వడం లేదని మండిపడ్డారు. గ్రామంలో రూ. 35 లక్షలతో ఉపాధి హామీ పనులు చేపట్టామని అధికారులు పేర్కొనగా ఆ నిధులు ఎక్కడ ఖర్చు చేశాలో ప్రజలకు తెలపాలని ప్రశ్నించారు. ప్రతి సమావేశంలో గ్రామ సమస్యలు మొరపెట్టుకుంటున్నా అధికారులు స్పందించడం లేదని, ప్రజల సమస్యలు పరిష్కరించలేని సమావేశం నిర్వహించడం ఎందుకని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ సమావేశం నుంచి వెళ్లిపోయారు. అనంతరం అధికార పార్టీకి చెందిన కొందరు ప్రజాప్రతినిధులు కూడా వారు ప్రశ్నించిన వాటిలో నిజాలు ఉన్నాయని, అందుకే తాము పెదవి విప్పలేదని తెలిపారు. సమావేశంలో తహశీల్దార్ రజాక్ వలి, ఈవోపీఆర్‌డి గుడేన, వైస్ ఎంపీపీ లీలావతి, మండల ప్రజా ప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు

## వైభవంగా పెన్నోబిలేశుని రథోత్సవం

**ప్రజాశక్తి-ఉరవకొండ**

మండల పరిధిలోని పెన్నఅహోబిలంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మరథోత్సవం బుధవారం అశేష భక్తజన సందోహం మధ్య అత్యంత వైభవంగా జరిగింది. ఆలయం నలుదిక్కులా గోవింద నామ స్మరణ మార్మోగింది. రథోత్సవం సందర్భంగా తెల్లవారుజాము నుంచే స్వామి మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. అలాగే రథానికి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారి ఉత్సవమూర్తులను రథంలో కొలువుదీర్చి భక్తుల గోవింద నామస్మరణ మధ్య రథాన్ని (మడుగు తేరు) లక్ష్మీదేవి ఆలయం వరకు లాగారు. సాయంత్రం వేలాది మంది భక్తజనం మధ్య బ్రహ్మరథోత్సవం నిర్వహించగా భక్తులు పండ్లు సమర్పించి మొక్కు తీర్చుకొన్నారు. వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి, జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. రథోత్సవ వేడుకల్లో జిల్లా నుంచే కాకుండా ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, ఇతర రాష్ట్రాల భక్తులు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఆలయ ఈవో విజయ్ కుమార్, దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు, ప్రధాన అర్చకులు ద్వారకానాథ్ స్వామి, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



రథోత్సవంలో పాల్గొన్న జనం

## బాలుడిపై కుక్క దాడి

**కదిరి అర్బన్ :** పట్టణ పరిధిలోని నిజాంవలి కాలనీకి చెందిన ఇర్ఫాన్ అనే బాలుడిపై కుక్క దాడిచేసి తీవ్రంగా గాయపరిచింది. బాలుని పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం బత్తలపల్లికి తీసుకెళ్లినట్లు బంధువులు తెలిపారు. బాలునికి ముఖానికి, కళ్లకు తీవ్రంగా గాయాలైనట్లు వారు తెలిపారు.పట్టణంలో ఏ వీధిలో చూసిన ఎక్కడ చూసినా కుక్కలు గుంపులు గుంపులు కనపడుతూనే ఉన్నాయని వీధుల్లో పిల్లలు, ముసలివాళు తిరగాలంటేనే భయం భయంగా ఉందని పట్టణవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పట్టణంలో కుక్కల బెడద లేకుండా చేయాలని కోరుతున్నారు. కుక్క దాడిలో తీవ్రంగా గాయపడిన బాలునికి ప్రభుత్వమే మెరుగైన చికిత్స చేయించాలని నిజాంవలి కాలనీ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

## షార్ట్ సర్క్యూట్‌తో రూ.4 లక్షలు నష్టం

**గుత్తి :** పట్టణంలోని బీసీ కాలనీలో బుధవారం తెల్లవారుజామున ఓ ఇంటిలో షార్ట్ సర్క్యూట్ జరిగి పలు వస్తువులు కాలి బూడిదయ్యాయి. మంగళవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి పట్టణంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. ఈ క్రమంలో ఇంటిలో ఉక్కపోత భరించలేక అనిత ప్రసన్న, రాజన్న దంపతులు పిల్లలతో కలిసి ఇంటిపై నిద్రించారు. అర్ధరాత్రి సమయంలో విద్యుత్ సరఫరా కావడంతో ఇంట్లో షార్ట్ సర్క్యూట్ జరిగి మంటలు రేగాయి. ఆ మంటల్లో విక్రయించేందుకు ఉంచిన చీరలు, నూతన దుస్తులు, గృహోపకరణలు కాలి బుడదయ్యాయి. పైకప్పుకు వేడి తగలడంతో గ్రహించిన వారు కిందికి దిగివచ్చి మంటలను ఆర్పారు. అప్పటికే ఇంటిలో ఉన్న వస్తువులన్నీ దగ్ధమయ్యాయి. దీంతో రూ.4 లక్షల నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని తహశీల్దార్ ఎస్.మహబూబ్‌బాషా, సీఐ ఎం.వెంకటరామిరెడ్డిలకు వేర్వేరుగా వినతి పత్రాలు అందజేశారు.

## మాజీ మంత్రిని పరామర్శించిన ఎమ్మెల్యే

**కదిరి అర్బన్ :** పట్టణంలోని ఎంజి రోడ్డు నందు నివాసమున్న మాజీ మంత్రి షాకీర్ సోదరుడు మహమ్మద్ షఫీ అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న శాసనసభ్యులు డాక్టర్ పివి సిద్దారెడ్డి షఫీ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం మాజీమంత్రి షాకీర్‌ను, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు పరిగి షామీర్. సాదిక్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

## ఈ స్టాంపు విధానమే ఉత్తమం

**కదిరి టౌన్ :** స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ఆధ్వర్యంలో ఈ స్టాంపు విధానం ప్రభుత్వం ప్రవేశపెట్టిందని ప్రజలు వ్యాపారస్తులు ఈ స్టాంపులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ అనంతపురం డిఐజి మాధవి, సత్య సాయి జిల్లా రిజిస్ట్రార్ కృష్ణకుమారి తెలిపారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ ప్రస్తుతం భూముల కొనుగోలు, అగ్రిమెంట్లు, వీలునామాలు, రిజిస్ట్రేషన్ కొరకు ప్రజలు వ్యాపారస్తులు నాన్ జ్యుడీషియల్ స్టాంప్స్ వాడుతున్నారని వీటి స్థానంలో స్టాక్ హోల్డింగ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఈ స్టాంప్స్ అందజేస్తారని తెలిపారు. డాక్యుమెంట్ రైటర్లు స్టాంప్స్ విక్రయించేవారు వీటి కొరకు దరఖాస్తు చేసుకుంటే ఈ స్టాంప్స్ కొరకు లైసెన్సులు మంజూరు చేస్తారని అన్నారు. వ్యాపారస్తులు డాక్యుమెంట్ రైటర్లు డాక్యుమెంట్లు విక్రయించేవారు ప్రతి ఒక్కరూ ఈ స్టాంప్స్ కు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.

## రైతులకు తప్పని పంట రుణాల రెన్యువల్ తిప్పలు

**బొమ్మనహాల్ :** రైతులకు ఏటా పంట రుణాల రెన్యువల్ తిప్పలు తప్పడం లేదు. మండలంలో 70 వేల మంది రైతులు వివిధ బ్యాంకులతో పాటు కో ఆపరేటివ్ సొసైటీల్లో వ్యవసాయ రుణాలు పొందారు. ఆయా రుణాలను 11 నెలల లోపు రెన్యువల్ చేస్తేనే పావలా వడ్డీ వర్తిస్తుందని పేర్కొంటుండడం, మరోవైపు అసలు, వడ్డీ మొత్తం చెల్లించాలని బ్యాంకు అధికారులు పేర్కొంటుండడంతో రైతులు వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. రూ. 1 అక్షకు 10 రోజులకు రూ. 1000 వడ్డీ చెల్లించి అప్పులు చేస్తున్న పరిస్థితులు నెలకొన్నాయి. అన్నీ సిద్ధం చేసుకొని రుణాలను రెన్యువల్ చేసుకోవడానికి బ్యాంకులకు వెళ్తే అక్కడ గంటల తరబడి వేచి ఉండక తప్పడం లేదు. కొన్ని బ్యాంకుల్లో గతేడాది తీసుకున్న అప్పులకు పంట నష్టపరిహారం సొమ్మును బ్యాంకులు జమ చేసుకున్నాయని రైతులు వాపోతున్నారు. వడ్డీ మాత్రమే కట్టించుకొని పంట రుణాలు రెన్యువల్ చేయాలని, గతంలో ఇచ్చిన రుణాన్ని కొంతమేర పెంచాలని ఆదేశాలు ఉన్నా బ్యాంకు అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వడ్డీ వ్యాపారులు, బ్యాంకు మేనేజర్లు కుమ్మక్కై, రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ప్రజా, రైతు సంఘాలు పేర్కొంటున్నాయి.

## నాడు-నేడు పనుల పరిశీలన

**నార్పల :** మండల పరిధిలోని చామలూరు, నిలువురాయి గ్రామాల్లోని పాఠశాలల్లో జరుగుతున్న నాడు-నేడు పనులను బుధవారం ఎంపీడీవో దివాకర్, ఈఓఆర్‌డి లక్ష్మీనరసింహతో కలిసి మండల ప్రత్యేకాధికారి మహమ్మద్ రఫీ, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి పరిశీలించి, పురోగతి గురించి ఇంజినీరింగ్ సహాయకులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయా గ్రామాల్లోని అంగన్వాడీ కేంద్రాలను సందర్శించి గర్భిణులు, చిన్నారులకు పౌష్టికాహారం క్రమం తప్పకుండా అందజేయాలని సూచించారు. సచివాలయానికి వెళ్లి సిబ్బంది పనితీరుపై సమీక్షించ చేయడంతో పాటు ఉద్యోగుల మూవ్ మెంట్ రిజిస్టర్, తదితర రికార్డులను తనిఖీ చేశారు. ప్రతి ఉద్యోగి సమయపాలన పాటిస్తూ, రోజుకు కనీసం 3 నుంచి 5 గంటల పాటు సచివాలయంలో ప్రజలకు అందుబాటులో ఉండి గ్రీవెన్స్ నిర్వహించాలని సూచించారు. వారి వెంట మండల పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు, గ్రామస్థులు ఉన్నారు.

## పాడి రైతులకు వరం 'సెమెన్'

**గార్లదిన్నె :** ఆవులకు ఎద సమయంలో సెమెన్ ఇంజక్షన్ వేయడం వల్ల 90 శాతం పశువులకు ఆడ దూడలు పుడతాయని పశసంవవర్ధక శాఖ ఉపసంచాలకులు సుధాకర్ తెలిపారు. మండల పరిధిలోని గుడ్డలపల్లి గ్రామంలో బుధవారం లేగ దూడల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లేగ దూడల ఎదుగుదల, పునరుత్పత్తిలో లింగ నిర్ధారిత వీర్యం, ముర్రుపాల ప్రాముఖ్యత, ఖనిజ లవణ మిశ్రమం వాడకం, క్రమం తప్పకుండా నట్టల నివారణ మందుల వాడకం ముఖ్యమైనవి అని వివరించారు. అనంతరం పాడి రైతులకు ఉచితంగా క్యాల్షియం టానిక్కులు, నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉప సంచాలకులు డాక్టర్ రమేష్‌రెడ్డి, గార్లదిన్నె పశువైద్యాధికారి రమేష్, గోపాలమిత్రలు, పారా మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు..

## ఫుట్‌బాల్ పోటీల్లో విద్యార్థిని ఉత్తమ ప్రతిభ

**గుత్తి :** పట్టణంలోని శ్రీసాయి డిగ్రీ కళాశాల విద్యార్థిని సి.మౌనిక ఫుట్‌బాల్ క్రీడలో ఉత్తమ ప్రతిభ కనబరిచింది. తిరుపతిలో జరిగిన ఏపీ సీఎం కప్ రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ టోర్నీలో మౌనిక జట్టు రన్నర్స్‌గా నిలిచింది. అత్యుత్తమ ప్రతిభ చూపిన మౌనికను బుధవారం ప్రిన్సిపల్ డాక్టర్ సి.వెంకటేశ్వర రెడ్డి, పిఆర్ఆర్ ఎంబిఏ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ప్రసన్నకుమార్, పిఈటి రవికుమార్, అధ్యాపకులు మల్లికార్జున, యాగంటి, విశాల అభినందించారు. పాఠశాల యాజమాన్యం నగదు బహుమతి అందజేసింది.

## బేలోడు గ్రామాన్ని సందర్శించిన జిల్లా వైద్యాధికారి

**గుమ్మఘట్ట :** మండల పరిధిలోని బేలోడు గ్రామంలో కలుషిత నీరు తాగి పలువురు తీవ్ర అస్వస్థతకు గురైన సంఘటన నేపథ్యంలో బుధవారం జిల్లా వైద్యాధికారి డాక్టర్ వీరబ్బాయి గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో మూడు రోజులు వైద్య శిబిరాలు నిర్వహించడంతో పాటు అపరిశుభ్రంగా ఉన్న ప్రదేశాల్లో బ్లీచింగ్ పౌడర్ వేయిస్తున్నట్లు తెలిపారు. రోగాల పట్ల ప్రజలకు వైద్య సిబ్బంది అవగాహన కల్పిస్తారని తెలిపారు. అనంతరం ఆయన రాయదుర్గం ప్రభుత్వాస్పత్రికి వెళ్లి చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించారు. ఆయన వెంట డాక్టర్లు రమేష్, బాలాజీ నాయక్, సిహెచ్ఓ మురళీధర్, సూపర్‌వైజర్ రవికుమార్, గ్రామ సర్పంచి ఉమేష్ రెడ్డి, ఆరోగ్య సిబ్బంది, తదితరులు ఉన్నారు.

## ఎస్పీని కలిసిన ఏడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్

**అనంతపురం :** ఏడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ ఎం.లిఖిత బుధవారం అనంతపురం జిల్లా ఎస్పీ శ్రీవివాసరావుని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె ఏడీసీసీ బ్యాంకు ఆధ్వర్యంలో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాల గురించి ఎస్పీకి వివరించారు. ఆమెతో పాటు బ్యాంకు మాజీ చైర్ పర్సన్ పామిడి వీరాంజనేయులు ఉన్నారు.